# తప్పొకరిది.. శిక్ష మరొకరికి

## సీఎంఆర్ఎఫ్ నిధుల బ్లాక్ లిస్టులో  పది హాస్పిటళ్లు







**గూగుల్ లో ఖమ్మం కేంద్రంగా బ్లాక్ లిస్టులో ఉన్న ఆసుపత్రులు...**

1. **శ్రీ వినాయక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్**
2. **శ్రీ శ్రీకరా మల్టీస్పెషాలిటీ హాస్పిటల్**
3. **గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్**
4. **జేఆర్ పసాద్ హాస్పిటల్**
5. **శ్రీ సాయి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్**
6. **వైష్ణవి హాస్పిటల్**
7. **సుజాత హాస్పిటల్**
8. **న్యూ అమృత హాస్పిటల్**
9. **ఆరెంజ్ హాస్పిటల్,**
10. **మెగాశ్రీ హాస్పిటల్**

రెండు రోజుల కిందట ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తమ గోడు వెళ్లబోసు కుంటున్న పైన చిత్రంలోని నిరుపేద కుటుంబాన్ని ఒక సారి పరిశీలిం చండి.. ఖమ్మం రూరల్ మండలం కామంచికల్‌కు చెందిన బాల నాగమణి పురుగు మందు తాగి గత నెల 9వ తేదిన శ్రీ వినాయక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. 5రోజుల పాటు చికిత్సచేసి 2లక్షల50వేల బిల్లు వేశారని బాధితులు మీడియాకు వెల్లడించారు. రూ.2 లక్షల 50వేలు బిల్లు వేశారని దానికి సంబంధించిన సిఎంఆర్ఎఫ్ బిల్లులు ఇవ్వమని అడిగితే ఇవ్వకుండా తమ ఆస్పత్రి బ్లాక్ లిస్టులో ఉందని బిల్లులు ఇవ్వడం కుదరదని చెప్పి మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్మిట్ అయి తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో సిఎంఆర్ఎఫ్ బిల్లులు ఇవ్వని ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామనీ, సదరు హాస్పిటల్ నిర్వాహకునితో పాటు మరికొంత మందిపై కేసులు నమోదు చేశారని ప్రెస్ మీట్ లో వెల్లడించారు. అనంతరం బాధితులు డియం అండ్‌హెచ్ఓ డాక్టర్ కళావతి బాయి కి ఫిర్యాదు చేశారు. ఇలాంటి పరిస్థితి ఈ ఒక్క హాస్పిటల్‌లోనే కాదు.. ప్రస్తుతం ఖమ్మంలో సుమారు ఇరవై వరకూ హాస్పిటళ్లలో చేరి వైద్యం పొందిన రోగుల కుటుంబాలు పడుతున్న ఆవేదన ఇది. అంతేకాదు... గత సంవత్సరం ఏప్రిల్ నెలకు ముందు సీఎంఆర్ఎఫ్ నిధులను వక్రమార్గంలో కాజేశారంటూ సీఐడీ, విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ గుర్తించింది. మొత్తం తెలంగాణ రాష్ట్రంలో 28 ప్రయివేటు హాస్పిటళ్లపై కేసులు కాగా ఒక్క ఖమ్మంలోనే మొదటిగా 21 విచారణ తరువాత పది హాస్పిటళ్లకు తగ్గించడం గమనార్హం. ఇక్కడ గుర్తించాల్సిన విషయం ఏమంటే ప్రస్తుతం ఖమ్మంలో 21 హాస్పిటళ్లు బ్లాక్ లిస్టులో ఉన్నట్టుగా జిల్లా ప్రజా ప్రతినిధులైన ఎంపీ, ఎమ్మెల్యేలు, తదితర కార్యాలయాల్లో నోటీసు బోర్డులపై ప్రజలకు చైతన్యం కలిగేలా ఆసుపత్రుల జాబితాను అంటించారు. కానీ సీఐడీ కేసులు నమోదు చేసిన ఆసుపత్రుల జాబితా ప్రస్తుతం గూగుల్‌లో పొందు పరిచారు. ఆ జాబితా ప్రకారం మొత్తం పది హాస్పిటళ్లు బ్లాక్ లిస్ట్, సీఎంఆర్ఎఫ్ రిజెక్టెడ్ జాబితాలో ఉన్నట్టుగా గుర్తించవచ్చు. కానీ గత ఏప్రిల్ తరువాత జరిపిన సీఐడీ విచారణ నివేదిక నేటికీ బయటికి రాకపోవడంతో పాటు గూగుల్ జాబితాలో లేని ఆసుపత్రుల పేర్లు కూడా ప్రసార మాధ్యమాల్లో సర్క్యులేట్ అవుతుండటంతో మిగతా ఆసుపత్రులకు ఇబ్బందిగా మారిందన్న చర్చ జరుగుతోంది.

### నకిలీ బిల్లులతో స్వాహా చేశారని అభియోగం..

ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం ఆర్ఎఫ్) నుంచి నిధులు స్వాహా చేసేందుకు ప్రయత్నిం చినందుకు ఖమ్మం జిల్లాలో పది ఆసుపత్రులపై తెలంగాణ సీఐడీ కేసులు నమోదు చేసింది. ఈ స్కామ్‌లో ఆసుపత్రి ఉద్యోగులు మరియు స్థానిక వ్యక్తులు నకిలీ బిల్లులను సృష్టించి, వాటిని సీఎంఆర్ఎఫ్ నుండి రీయింబర్స్‌మెంట్ కోసం సమర్పిం చడానికి ఆసుపత్రి పరిపాలనతో కుమ్మ క్కయ్యారనీ,  కేసు యొక్క ఎఫ్ఐఆర్ ప్రకారం, డి.ఎస్.ఎన్ మూర్తి దాఖలు చేసిన ఫిర్యాదు. తెలంగాణ సచివాలయంలోని సీఎంఆర్ఎఫ్ విభాగంలో సెక్షన్ ఆఫీసర్ అయిన మూర్తి రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చారు.

### అవగాహన లేక రోగుల అవస్థలు

ఖమ్మంలోని ఏ ఏ ఆసుపత్రులను సీఎంఆర్ఎఫ్ బ్లాక్ లిస్టులో పెట్టారో తెలియక నిత్యం వేలాది మంది గ్రామీణ ప్రాంతాలనుండి వచ్చే రోగులు  ఇబ్బందులు పడుతున్నారు. రోగాలనుండి ప్రాణాలు కాపాడుకునేందుకు పైసా పైసా కూడగట్టి హాస్పిటల్ బిల్లులకు చెల్లించి తీరా ఆ హాస్పిటల్ బ్లాక్ లిస్టులో ఉందని తెలియగానే ఆందోళన చెందుతున్నారు. ఆరోపణలు రుజువుకాని ఆసుపత్రుల జాబితాను బ్లాక్ లిస్టు నుండి తొలగించాలని ఆయా హాస్పిటళ్ల మేనేజ్ మెంట్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.